సమస్యలతో సహవాసం



దయానందనగర్‌లో నిత్యం వెలుగుతున్న విద్యుత్ లైటు

ఆ ప్రాంతంలో రహదారులను చూస్తే సీసీ రోడ్లంటే నమ్మ శక్యం కాదు, అంత అధ్వానంగా ఉన్నాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో సాయంత్రమైతే చాలు, దోమలదే రాజ్యం. ఇక దయానంద్‌నగర్‌కు చేరుకోవాలంటే ప్రమాదమని తెలిసీ రైలు పట్టాలు దాటాల్సిందే. వీధి లైట్ల నిర్వహణ మరీ ఘోరం. కొన్ని వీధుల్లో **పగలు, రాత్రి** కూడా లైట్లు వెలుగుతూ ఉంటే, **మరికొన్ని** ప్రాంతాలు అంధకారంలోనే **మగ్గుతాయి.** దీంతో పేరుకే స్మార్ట్ సిటీలో **ఉంటున్నాం** గానీ, పరిస్థితి కుగ్రామంకంటే దారుణంగా ఉందంటూ ప్రజలు నిట్టూరుస్తున్నారు.



గొల్లకంచరపాలెంలో మట్టిరోడ్లను తలపిస్తున్న సీసీ రోడ్డు



శిథిలావస్థలో గెడ్డలు-కాలువలు

- మట్టి రోడ్లను తలపిస్తున్న సీసీ రహదారులు
- కలగానే ఫుట్ ఓవర్ వంతెన నిర్మాణం
- కాలం చెల్లిన విద్యుత్ తీగలు
- ప్రజలు అవస్థలు వర్ణనాతీతం

కంచరపాలెం: నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడానికి అధికారులు ఓ వైపు ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం నుంచి గౌరీనగర్ వరకు గల తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, చెవుటిరాములవీధి, మల్లసూరివీధి తదితర ప్రాంతాల్లో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఆయా కాలనీప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైలు పట్టాలే ప్రధాన మార్గం



గొల్ల కంచరపాలెం నుంచి ప్రమాదభరితంగా రైల్వేట్రాక్ దాటుతున్న ప్రజలు

కంచరపాలెం ప్రధాన రహదారి నుంచి గవరకంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట, దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, పైడిమాంబ కాలనీ ప్రాంతాలకు వెళ్లే వార్డు ప్రజలకు రైల్వేట్రాక్‌లు ఇబ్బంది కరంగా మారుతున్నాయి. వాహనదారులకు అండర్‌పాత్ వేసినా, దీవిలా ఉన్న దయానందనగర్‌కు పట్టాలే ప్రధాన మార్గంగా మారుతోంది. ఫుట్ ఓవర్ వంతెన నిర్మించాలని వినతులు సమర్పించినా ఫలితం లేకపోయింది. నిత్యం సమస్యలు వేధిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. కాలనీ వాసులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం శూన్యం. దీంతో సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు.

గోతులు తవ్వి వదిలేశారు

ఆయా కాలనీల్లో కొన్నేళ్ల కిందట చేపట్టిన 24/7 మంచినీటి పైపులైన్ పనుల నిమిత్తం రహదారి మధ్యలో గోతులు తవ్వారు. అయితే, పనులు పూర్తయిన అనంతరం అరకొర పనులతో సరిపెట్టేయడంతో మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. దీంతో వర్షాలు పడుతున్న సమయంలో గోతుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వీధుల్లోనూ రోడ్లు అలానే ఉండడంతో పాదచారులు జారిపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

తీవ్రమైన దోమల బెడద

గొల్లకంచరపాలెం నుంచి గౌరీనగర్ వరకు గల రైల్వేట్రాక్ రహదారి ప్రధాన గెడ్డల్లో చెత్తచెదారాలతో నిండడంతో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుంది. వార్డుల్లో పందులు గుంపులుగా తిరుగుతూ స్థానికులపై దాడి చేస్తున్నాయి. చెత్తచెదారాల్లో పందులు, దోమలు విజృంభణ చేస్తుండంతో తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. పందుల సంచారాన్ని అరికట్టాలని, దోమల నివారణచర్యలు చేపట్టాలని ప్రజారోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

విద్యుత్ లైట్లకూ అంతరాయమే..

ఆయా కాలనీల్లో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో పగటి సమయంలోనూ విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి. కాలం చెల్లిన విద్యుత్ తీగలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో దొంగల భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్పొరేటర్‌కు, అధికారులకు ఫిర్యాదు చేసినా..

మా కాలనీలో సమస్యలపై అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధి టీడీపీ కార్పొరేటర్‌కు ఫిర్యాదులు చేశాం. కానీ ఫలితం లేకపోయింది. చాలాకాలం కిందట రోడ్డు మధ్యలో తవ్వేశారు. వాటిని ఇప్పటికీ పూడ్చలేదు. దీంతో రాకపోకలకు కష్టమవుతోంది. దోమల కారణంగా జ్వరాలతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు మా గోడు ఆలకించాలి. మా సమస్యలు పరిష్కరించాలి.

– **బి.లత**, గోకుల్‌నగర్, కంచరపాలెం

ఎమ్మెల్యే దృష్టి సారించాలి

మా కాలనీ సమస్యలపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలి. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా వినతులు అందించాం. ఇప్పటికైనా మా ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. రోడ్లకు మరమ్మతులు చేయించాలి. పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి.

– **కె.అప్పలరాజు**, దుర్గానగర్, ఊర్వశి కూడలి

అంగన్‌వాడీ కేంద్రాలను కేటగిరీ-2లోకి మార్చడం లేదు

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరాను కేటగిరి-2గా మార్పు చేయడం లేదని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. 'అంగన్‌వాడీలకు కరెంట్ షాక్' అనే శీర్షికన ఈ నెల 15న 'సాక్షి దినపత్రికలో ప్రచురించిన పరిశీలనాత్మక కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ బిల్లులు పెరుగుతాయని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేయడంతో ఐసీడీఎస్ అధికారులు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పేరు మీద మొత్తం 75 సర్వీసులు ఉన్నాయని,ఇందులో 66 సర్వీసులు కేటగిరీ -4(బీ) లో బిల్లులు ఇస్తున్నామని ఎస్ఈ శ్యాంబాబు తెలిపారు. లక్ష్మీపురం, బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో 6 అంగన్‌వాడీ సర్వీసులు కేటగిరీ-1లో ఉండగా, వాటిని మంగళవారం కేటగిరీ-4(బీ)గా మార్పు చేశామన్నారు. ఏపీఈఆర్‌సీ టారిఫ్ ఉత్తర్వులు మేరకే ఇటువంటి మార్పులు చేస్తున్నామన్నారు. ఇంకా ఏమైనా సర్వీసులు మిగిలి ఉంటే వాటిని కూడా కేటగిరీ-4(బీ) కింద మారుస్తామన్నారు. అంతేకాని కేటగిరీ-1లో ఉన్న సర్వీసులు కేటగిరీ-2గా మార్చాలని ఎవరినీ ఒత్తిడి చేయలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది మాత్రం అంగన్‌వాడీలకు కేటగిరీ2గా మార్పు చేయాలని ఉన్నతాధికారులు చెప్పారని, అందుకే తాము కేంద్రాలకు వెళ్లి ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చామని చెప్పడం గమనార్హం.

టీకాలతో రక్షణ

మహారాణిపేట: వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నోడల్ అధికారులు, ఇతర అధికారుల సమక్షంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవలు, గర్భిణుల సేవలు, సపోర్ట్ సూపర్ విజన్, వ్యాధి నిరోధక టీకాలను సిబ్బందికి వివరించారు. కిల్కారి సేవలపై ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

క్లుప్తంగా

స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు

మహారాణిపేట: మాజీ సైనికులు, వితంతువులకు స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు మంగళవారం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో కంచరపాలెం ఎంప్లాయిమెంటు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి బి.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మాజీ సైనికులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు బయోడేటాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, ఖాదీ విలేజ్ ఇండ్రస్టీ ఏడీ పద్మవతి, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంటు ఆఫీసర్ చాముండేశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం, మాజీ సైనికులు, వితంతువులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచార కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ తదితరులు

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గోపాలపట్నం ప్రాంతంలో మంగళవారం ప్రచారం నిర్వహిచారు. గోపాలపట్నం ప్రాంతంలో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసన మండలిలో పోరాడుతానని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు తొలి ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

సందడిగా క్రిస్మస్



శాంతా క్లాజ్ వేషధారికి బహుమతి అందిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎం.పాల్ భాస్కర్, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెన్‌సెంట్, మదన్ చక్రవర్తి క్రీస్తు పుట్టుక, గొప్పతనం గురించి బోధించారు. శాంతా క్లాజ్ వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థులకు కళాశాల చైర్మన్.జి సత్యనారాయణ బహుమతులు అందించారు.

క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు

ఏయూ వ్యాయామ విద్యావిభాగం డైరెక్టర్ ఆచార్య విజయమోహన్



క్రీడాకారులతో స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ విజయ మోహన్ తదితరులు

విశాఖ విద్య: క్రీడల్లో ప్రతిభ సాధిస్తే ఉపాధికి మార్గాలు చూపిస్తాయని ఏయూ వ్యాయామ విద్యావిభాగం డైరెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయ మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో ఆంధ్రాయూనివర్సిటీకి ఎంపికైన మహిళల బాస్కెట్ బాల్ జట్టును అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ మహిళల బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు స్కూల్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్, కొట్టాం, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈనెల 20 నుంచి 24 వరకు జరుగుతాయన్నారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ మహిళల బాస్కెట్ బాల్ క్రీడలో ప్రతిభ సాధించి వర్సిటీ మంచి పేరుతీసుకు రావాలన్నారు.

జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తాం

పారిశుధ్య కార్మికుల హెచ్చరిక



జీతాలు చెల్లించాలని నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మల్కాపురం: రోజులు గడుస్తున్నాయి గానీ తమకు జీతాలు మాత్రం ఇంకా చెల్లించలేదని పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా 5వ తేదీన చెల్లించాల్సిన వేతనాలు 17వ తేదీ వచ్చినా చెల్లించకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని పారిశుధ్య కార్మికుల కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల ప్రతినిధి కె.రమణ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని పలు వార్డులలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న తమకు ప్రతీ నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. 17వ తేదీ వచ్చినా నేటికీ అధికారులు తమ జీతం ఊసు ఎత్తకపోవడంతో అప్పులు చేసి గడుపుతున్నామన్నారు. ప్రతీ నెలా ఇదే తీరుగా ఉంటోందన్నారు. ఒక పూట పనికి రాకపోతే అనేక ప్రశ్నలతో వేధించే అధికారులు తమ జీతం విషయంలో ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. ఇప్పటికై నా తమ జీతాలను చెల్లించాలని, లేకుంటే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: రెవెన్యూ సమస్యల పరిష్కరించడానికే సదస్సులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గణబాబు చెప్పారు. జీవీఎంసీ 92వ వార్డు కంపరపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గణబాబు మాట్లాడుతూ సదస్సులో అందిన వినతులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. సదస్సులో ఎల్‌జీ పాలిమర్స్ నిర్వాసితులు, కంపరపాలెం, మేహాద్రి గెడ్డ కాలనీ, పద్మనాభనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు వినతులు అందించారు. రిజర్వాయర్ నిర్మాణం సమయంలో తమ స్థలాలు తీసుకుని ఇంటి స్థలాలకు ఇచ్చిన పట్టాలు వల్ల ప్రయోజనం లేదని వాపోయారు. వాటిని వారసుల పేరుమీద మార్చుకునేందుకు కూడా అవకాశం లేదన్నారు. ఈ స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జోన్-8 కమిషనర్ హేమావతి, తహసీల్దార్ సీహెచ్ వి.రమేష్, ఈవో శేఖర్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్‌తో ఉద్యోగుల జీవనానికి భరోసా



జీవీఎంసీ గాంధీ పార్కులో పెన్షనర్లు

సీతమ్మధార : జీవీఎంసీ గాంధీ పార్కులో 'పెన్షనర్స్ డే' వేడుకలను ఏపీ ఆర్‌పీఏ విశాఖ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందుస్థాన్ షిప్‌యార్డు, జింక్, హెచ్‌పీసీఎల్, ఆర్టీసీ, బీహెచ్‌ఈఎల్ వంటి వివిధ సంస్థల నుంచి పెన్షనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.ఎం.కుమార్ మంగలం మాట్లాడుతూ పెన్షనర్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. నకారా కేసులో న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్ తీర్పు అంశాలను తెలియజేశారు. అనంతరం ఏపీ ఆర్‌పీఏ గౌరవ అధ్యక్షుడు బి.టి.మూర్తి మాట్లాడుతూ 'పెన్షన్ అంటే దానం కాదని, ఉద్యోగ విరమణ తర్వాత గౌరవప్రదమైన జీవనానికి హక్కు' అని, భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. కనీస పెన్షన్‌ను 9 వేలు ప్లస్ డీఏతో చెల్లించాలని కోరారు. భార్య, భర్తకు వైద్య సదుపాయాలు కల్పించాలని, రైల్వే ప్రయాణంలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షనర్స్ వి.నర్సింగరావు, బుగత అప్పారావును తిరుపతిరావు, అప్పారావు, ఎస్.చలపతిరావు, సూర్యచంద్రరావు సత్కరించారు. ఏపీఆర్‌పీఏ కోశాధికారి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మల్కాపురం: ఆటోను కారు ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్‌తో పాటు ప్రయాణిస్తున్న మహిళ తీవ్రంగా గాయపడ్డారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు... జీవీఎంసీ 58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనుకు చెందిన కారులో డ్రైవర్ శేఖర్ సోమవారం సాయంత్రం మారుతీ సర్కిల్ మీదుగా నగరం వైపు వెళ్తున్నాడు. ఆ సమయంలో కె.సతీష్ అనే ఆటో డ్రైవర్ ఇద్దరి ప్రయాణికులతో నగరం నుంచి మారుతీ సర్కిల్ వైపు వస్తున్నాడు. ఆ సమయంలో కారు ఆటోను ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ శేఖర్‌తో పాటు ఆటోలో ఉన్న అనకాపల్లి ప్రాంతానికి చెందిన పండితాక రత్నంకు తీవ్ర గాయాలయ్యాయి.

12 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం మీదుగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని మంగళవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ చిట్టిబాబు మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఢిల్లీకి చెందిన మొహమ్మద్ ముజామ్మిల్ నుంచి 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

కార్మిక నాయకుడు నర్సింగ్‌యాదవ్ మృతి



నర్సింగ్‌యాదవ్ (ఫైల్)

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎదురు నర్సింగ్‌రావు (నర్సింగ్‌యాదవ్) అనారోగ్యం కారణంగా మంగళవారం ఉదయం మృతి చెందారు. హెచ్‌పీసీఎల్ ఐఎన్‌టీయూసీ (కాంట్రాక్ట్ లేబర్) యూనియన్ మరియు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా ఆయన సేవలందించారు. నర్సింగ్‌యాదవ్ మృతిపై వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సంతాపం తెలిపారు. నక్కవానిపాలెంలోని నివాసంలో నర్సింగ్‌యాదవ్ మృతదేహానికి పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, వైఎస్సార్ టీయూసీ రీజనల్ కో-ఆర్డినేటర్ కలిదిండి బద్రీనాథ్, జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్, 40, 58, 59, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీయాదవ్, పి.వి.సురేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఆగ్రహం

బిల్లుల దహనం

మల్కాపురం: తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే భారీగా భారం మోపడం ఎంతవరకు సమంజసమని సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ నాయకుడు కె.పెంటారావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ జోన్ కమిటీ ఆధ్వర్యంలో 59వ వార్డు నెహ్రూ నగర్ వద్ద మంగళవారం విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా పెంటారావు మాట్లాడుతూ చంద్రబాబు మాయ మాటలు నమ్మి రాష్ట్ర ప్రజలు మరోసారి మోసపోయారన్నారు. గద్దె ఎక్కేదాక ఒక మాట, గద్దె ఎక్కిన తర్వాత ఒకమాట చంద్రబాబు నైజమని విమర్శించారు. నమ్మిన ప్రజలను పదేపదే మోసం చేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. ట్రూ అప్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలను అధికంగా పెంచడం కూటమి ప్రభుత్వానికి తగునా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంధన పొదుపుతో పర్యావరణ పరిరక్షణ



ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఈ శ్యామ్‌బాబు, ఈఈ బీకే నాయుడు తదితరులు

మురళీనగర్: ఇంధనం పొదుపు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.శ్యామ్‌బాబు పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను అల్లూరి సీతారామరాజునగర్‌లోని ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనం పొదుపు చేసినప్పుడే భావితరాల అవసరాలను తీర్చగలమన్నారు. ముఖ్యంగా విద్యుత్‌ను అవసరాలకు మించి వాడొద్దన్నారు. అవసరం లేకపోయినా విద్యుత్ దీపాలు వెలిగించి ఉంచడం వల్ల ఖర్చులు కూడా పెరుగుతాయన్నారు. స్టార్ రేటింగ్ విద్యుత్ పరికరాలు వాడాలన్నారు. ఎల్ఈడీ బల్బులు, ఎల్ఈడీ ఫ్యానులు వాడడం ద్వారా విద్యుత్‌ను పొదుపు చేయవచ్చన్నారు. ఏసీ వాడినప్పుడు టెంపరేచర్ 24 డిగ్రీలు మించి ఉండాలన్నారు. సోలార్ రూఫ్ టాప్‌ల ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను పొందవచ్చన్నారు. సోలార్ ప్యానెల్స్ 25 సంవత్సరాల జీవిత కాలం పనిచేస్తాయన్నారు. సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేసేవారికి ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తోందని, ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక కిలోవాట్‌కు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకూ ఖర్చు అవుతుందని, ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. 3 కిలోవాట్‌లు, ఆపైన ఎంత పెట్టుకున్నా రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. ద్వారా సీవో రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీకే నాయుడు, డిప్యూటీ ఈఈ శివసత్యనారాయణ, మురళీనగర్ ఏఈ ఎం.రాజేష్, కంచరపాలెం ఏఈ ప్రసాద్, ఎస్ఎస్‌టీఎల్ వెంకటేశ్వరరావు, మద్రిపాలెం ఏఈ లలితాభాయ్ పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 16వ రోజు మంగళవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన చేశారు. అష్టదళ పద్మారాధన పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో... : అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగశాలల పనులు వేగవంతం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సి 4ఐ4 ప్రయోగశాలల పనులు వేగవంతం చేయాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనంజయరావు అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో రిజిస్ట్రార్ ధనుంజయ రావుతో సమర్థ ఉద్యోగ్ డైరెక్టర్ ప్రదీప్ సమావేశమయ్యారు. సెంటర్ ఫర్ ఇండస్ట్రీ 4.0 ఉపయోగాలను వివరించారు. సి4ఐ4 ల్యాబ్ నుంచి వైవిధ్యమైన కోర్సులను డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఎంఎస్ఎంఈ, ఇండస్ట్రీస్‌లో పనిచేసే వారికి అందించవచ్చునన్నారు.